



## నేడు సార్వత్రిక సమ్మె

నిజామాబాద్ కల్చరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజాసంఘాలు, వివిధ కార్మిక యూనియన్‌లు ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం సార్వత్రిక సమ్మె జరగనుంది. జిల్లా వ్యాప్తంగా వివిధ సంస్థలలో పనిచేస్తున్న కార్మికులు సమ్మెలో పాల్గొననున్నారు. జిల్లాలోని సీఐటీయూ, టీయూసీఐ, ఏఐయుకేఎస్, ఎస్‌కెఎం, సీపీఐ, సీపీఎం, సీపీఐఎంఎల్ కార్మిక సంస్థలు, యూనియన్‌లు అనుబంధ సంస్థలు సమ్మెలో పాల్గొననున్నాయి. నాలుగు లేబర్ కోడ్ చట్టాలను వ్యతిరేకిస్తూ సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఆయా సంస్థలు ప్రకటించాయి.




- జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా కృష్ణమాల కొండారెడ్డి
- పదేళ్ల తర్వాత పూర్తిస్థాయి సూపరింటెండెంట్ నియామకం
- సమస్యలతో స్వాగతం పలుకుతున్న జీజీహెచ్

# కొత్త సార్ రాకతో.. పెద్దాసుపత్రి గాడిలో పడేనా?

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పేరుకే ఏడంతస్తుల మేడ. కానీ లోపల అన్నీ సమస్యలే. ఇదీ జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి పరిస్థితి. 750 పడకల సామర్థ్యం కలిగిన జీజీహెచ్ సమస్యలతో సతమతమవుతోంది. నిరుపేదలకు ప్రైవేటు ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందించేందుకు ఏర్పాటైన జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి అరకొర వసతులతో నిత్యం ఏదో ఒక సమస్యతో కొట్టుమిట్టాడుతోంది. ఆసుపత్రిలో అధునాతన పరికరాలు ఉన్నా రోగులకు మాత్రం నాణ్యమైన వైద్యం అందడం లేదు. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్యులతో పాటు సిబ్బంది కొరత అధికంగా ఉంది. 12 ఏళ్ల క్రితం జిల్లాకు మెడికల్ కళాశాల మంజూరు కాగా పాత ఆసుపత్రి భవనాన్ని మెడికల్ కళాశాల కోసంఇచ్చి ఏడంతస్తులలో నూతన భవనాన్ని నిర్మించారు. కానీ గత పదేళ్లలో జీజీహెచ్‌లో సరైన పర్యవేక్షణ లేక నూతన భవనం పాత భవనాన్ని తలపిస్తోంది. ఆసుపత్రి నిండా లీకేజీలే కనిపిస్తున్నాయి. 750 పడకల ఆసుపత్రిగా ప్రారంభమైన జీజీహెచ్‌కు ఇటీవల అదనంగా మరో 200 బెడ్‌లను కేటాయించారు. ఇప్పటి వరకు పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేకపోవడంతో ఆసుపత్రి నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంటుంది. గతంలో పదేళ్ల పాటు ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లే ఆసుపత్రి నిర్వహణ బాధ్యతలు నిర్వహించారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌లు పనిచేసిన సమయంలో ఆసుపత్రి అనేక వివాదాలకు కేంద్ర బిందువుగా నిలిచింది. గత జనవరి 14వ తేదీ అనేక వివాదాస్పద నిర్ణయాలతో పాటు అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ప్రతిమరాజ్‌ను బదిలీ చేసి మెడికల్ కళాశాల ప్రొఫెసర్, చిల్డ్రన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ పి.శ్రీనివాస్‌ను నియమించారు. అధికారులు మారినప్పటికీ ఆసుపత్రి తీరు మాత్రం మారడం లేదు. ఇటీవల ఆసుపత్రిలో దొంగతనాలతో పాటు ఆత్మహత్యలు ఎక్కువగా అవుతుండటం ఆసుపత్రి పర్యవేక్షణకు అద్దం పడుతుంది. అధికారులు మారిన పూర్తిస్థాయి సూపరింటెండెంట్ లేకపోవడంతో ఆసుపత్రి నిర్వాహణ అస్తవ్యస్తంగా మారింది. ఉస్మానియా యూనివర్సిటీ మెడికల్ కళాశాల కార్డియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కృష్ణ మాలకొండారెడ్డిని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా జెడ్‌చొంగ్తూ జిల్లా కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. నూతన సూపరింటెండెంట్ రాకతోనైనా జిల్లా కేంద్ర ఆసుపత్రి గాడిలో పడుతుందని ప్రజలు ఆశిస్తున్నారు.

### అనేక సమస్యలు..

జిల్లా కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రికి ఉమ్మడి జిల్లా నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా రోగులు వస్తారు. రాత్రి సమయాలలో చుట్టుపక్కల ఎక్కడ ప్రమాదాలు జరిగిన జిల్లా కేంద్ర ఆసుపత్రికే తీసుకురావడం పరిపాటిగా మారింది. అయినప్పటికీ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వసతులు మాత్రం రోజురోజుకు దిగజారుతున్నాయి. జీజీహెచ్‌లో పారిశుధ్య వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంటుంది. డ్రైనేజీ తీరు పాత ఆసుపత్రిని తలపిస్తోంది. వసతులు ఉన్నప్పటికీ సిబ్బంది లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఆసుపత్రిలో అత్యవసర సమయాల్లో వినియోగించే మందులు సైతం దొరకడం లేదు. అత్యవసర పరిస్థితుల్లో మందులు లేక రోగులు ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయి. ఆసుపత్రిలో లిఫ్ట్, తాగునీటి వసతి, ఇతర సౌకర్యాల విషయంలో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. టీహబ్ ద్వారా అత్యాధునిక పరికరాలతో రక్త పరీక్షలు నిర్వహించిన అవి సక్రమంగా పనిచేయడం లేదు. ప్రస్తుతం కొన్ని పరీక్షలు మాత్రమే చేస్తున్నారు. క్యాట్‌లాక్, సిటీస్కాన్, టీపాస్ స్కానింగ్ తదితర పరికరాలు ఉన్నప్పటికీ సరైన సిబ్బంది లేక అవి నిరుపయోగంగానే ఉంటున్నాయి. సిటీస్కాన్, ఎంఆర్ఐ, ఎక్స్‌రే లాంటి సేవల కోసం రోగులు ప్రైవేటు సేవలను వినియోగిస్తున్నారు.

### వేధిస్తున్న ఖాళీల బెడద..

జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రిలో మొత్తం 281 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా రెగ్యులర్ సిబ్బంది 104 మంది మాత్రమే ఉన్నారు. కాంట్రాక్టు సిబ్బంది 69 మంది ప్రస్తుతం పనిచేస్తున్నారు. 108 ఖాళీలు ఉన్నాయి. ప్రొఫెసర్ పోస్టులు మొత్తం 38 ఉండగా రెగ్యులర్ 21 మంది, ఒకరు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుండగా 16 ఖాళీలు ఉన్నాయి. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు 63 ఉండగా 13 మంది రెగ్యులర్ ప్రొఫెసర్లు, 6 కాంట్రాక్టు ప్రొఫెసర్లు పనిచేస్తున్నారు. 44 అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 147 ఉండగా రెగ్యులర్ 61 మంది, కాంట్రాక్టు పద్ధతిలో 48 మంది పనిచేస్తుండగా 38 ఖాళీలు ఉన్నాయి. ట్యూటర్లు 23 మంది ఉండాల్సి ఉండగా 9 మంది రెగ్యులర్, 11 మంది కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తుంటే 3 ఖాళీలు ఉన్నాయి. సీఏఎస్‌లు మొత్తం 10 మంది ఉండగా రెగ్యులర్ సిబ్బంది ఎవరూ లేరు. 3 కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. 7 ఖాళీలు ఉన్నాయి. ప్రభుత్వం ఇటీవల 18 మంది ప్రొఫెసర్లను బదిలీ చేయడంతో వైద్యుల కొరత తీవ్రంగా ఉంది. జీజీహెచ్‌లో పీజీ డాక్టర్లతోనే వైద్య సేవలను అందిస్తున్నారు.

### తగ్గిన శస్త్రచికిత్సలు..

జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాలు రోజురోజుకి తగ్గుతున్నాయి. అత్యవసర కేసులను హైదరాబాద్‌లోని నిమ్స్, ఉస్మానియా, గాంధీ ఆసుపత్రులకు పంపిస్తున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం శస్త్రచికిత్సలు భారీగా తగ్గాయి. గత ఏడాది జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలల్లో 2560 శస్త్రచికిత్సలు జరగగా ఈ ఏడాది 3 నెలల్లో 2వేల కేసులు మాత్రమే నమోదు అయ్యాయి. గతంతో పోలిస్తే శస్త్రచికిత్సలు భారీగా తగ్గాయి. అత్యవసర పరిస్థితుల్లో జీజీహెచ్‌కు వచ్చిన వారిని హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ముఖ్యంగా సూదిమందులు, పరికరాల కొరత వల్లే ఈ పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో జీజీహెచ్‌లో 200లకు పైగా మోకాలు ఆపరేషన్లు నిర్వహించిన ఘనత ఉండగా ఇటీవల కాలంలో మోకాళ్ల ఆపరేషన్ల సంఖ్య తగ్గింది.



సిబ్బందికి కళ్ల అద్దాలను అందజేస్తున్న పోలీసు కమిషనర్

## పోలీసు సిబ్బంది ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి : సీపీ

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ విధుల నిర్వహణలో ఉంటూ ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తారని అందువల్లే అనారోగ్యానికి గురవుతారని ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సీపీ సాయిచైతన్య కోరారు. మంగళవారం పోలీస్ హెడ్‌క్వాటర్‌లో మల్లారెడ్డి, నారాయణ ఆసుపత్రుల సౌజన్యంతో మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని సీపీ సాయిచైతన్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రత్యేకంగా ఆర్‌బీఎస్, కంటి పరీక్ష, ఈసీజీ, 2డిఈకో, క్యాన్సర్, స్క్రీనింగ్, బీపీ, షుగర్ మొదలగు వైద్య పరీక్షల ద్వారా గుర్తించి మనకు అందుబాటులో ఉన్న ఆహార భద్రతను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతీ సంవత్సరం ఒక్కసారైన ఆరోగ్యం కోసం వైద్యులను సంప్రదించాలన్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు హెల్త్ క్యాంప్ నిర్వహించగా నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్‌లలో పనిచేస్తున్న సిబ్బంది, పోలీసు కార్యాలయ సిబ్బంది, హెడ్‌క్వాటర్స్ సిబ్బంది, హోంగార్డ్స్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు పోలీసు కమిషనర్‌లు బస్వారెడ్డి, రాంచందర్ రావు, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, ఏసీపీలు రాజావెంకటరెడ్డి, పి.శ్రీనివాసులు, వెంకటేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

### సీపీని కలిసిన నూతన ఎస్సైలు

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొదటి సారి పోలీస్ స్టేషన్ ఎస్సైలుగా బాధ్యతలు తీసుకున్న అనంతరం సీపీ సాయిచైతన్యను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ధర్పల్లి ఎస్సై ఎం.కళ్యాణి, మోపాల్ ఎస్సై సుస్మిత, ఎడపల్లి ఎస్సై రమా, బాల్కొండ ఎస్సై శైలేందర్, మెండోరా ఎస్సై సుహాసిని, ఏర్గట్ల ఎస్సై రాజేశ్వర్, 3వ టౌన్ 2వ ఎస్సై కిరణ్‌పాల్‌లు సీపీని కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ బాధ్యతా యుతంగా విధులు నిర్వహించాలని పోలీస్ స్టేషన్‌లకు వచ్చే బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను నిబద్ధతగా అమలు చేయాలని ప్రతీ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు.

### పదోన్నతి పొందిన వారిని అభినందించిన సీపీ

డీజీపీ ఆదేశాల మేరకు నిజామాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో హెడ్‌కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన 8 మందిని సీపీ సాయిచైతన్య మంగళవారం అభినందించారు. కొంత కాలంగా పదోన్నతుల కోసం ఎదురు చూస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్సైలుగా పదోన్నతి రావడంపై ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సైలుగా పదోన్నతి పొందిన ఎండీ రియాజుద్దీన్, కె.పరమేశ్వర్, పి.వసంత్‌రావు, జక్రయ్య, అరుణకుమారి, అనురాధ, రమనేశ్వరి, ముంతాజ్‌బేగంలను పోలీసు కమిషనర్ అభినందించారు.

## ఐదు తరగతులకు ఒకే గది

- సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

## బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తుల జప్తునకు కోర్టు ఆదేశాలు జారీ

- పరిహారం చెల్లించేందుకు చర్యలు
- బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో

7


వెల్నెస్ సెంటర్ సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో రాజశ్రీ

## రోగులకు మెరుగైన సేవలను అందించాలి

● సిబ్బంది సమయపాలన పాటించాలి ● వెల్నెస్ కేంద్రం తనిఖీలో జిల్లా వైద్యాధికారి రాజశ్రీ

సుభాష్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వెల్నెస్ సిబ్బంది సమయపాలన పాటిస్తూ రోగులకు అవసరమైన నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా వైద్యాధికారి రాజశ్రీ వెల్నెస్ అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో గల ఉద్యోగుల, జర్నలిస్టుల వెల్నెస్ సెంటర్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల హాజరు పట్టికను, ఓపీ విభాగాన్ని, ల్యాబ్‌ను, స్టోర్‌లో ఉన్న ఫార్మసీ విభాగాన్ని, మందుల నిల్వలను తనిఖీ చేసి రిజిస్టర్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి రాజశ్రీ మాట్లాడుతూ.. రోగులకు మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అవసరమైన రోగుల వద్ద నుంచి బ్లడ్ శాంపిళ్లను తీసి టీ హబ్‌కు పంపించాలని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, నిర్లక్ష్యం వహించిన ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వెల్నెస్ సెంటర్ వైద్యాధికారి కృష్ణవేణి, వెల్నెస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


బోధన్ మున్సిపాలిటీలో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## సంక్షేమ పథకాల అమలుపై నిరంతర పర్యవేక్షణ జరపాలి

బోధన్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలులో లక్ష్యాల సాధన కోసం నిరంతర పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం బోధన్ మున్సిపాలిటీని ఆయన సందర్శించి సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, వన మహోత్సవం, సీజనల్ వ్యాధుల నియంత్రణ కోసం చేపడుతున్న ముందస్తు చర్యలు, ప్లాట్ల క్రమబద్ధీకరణ దరఖాస్తుదారులకు ప్రొసీడింగ్‌ల జారీ తదితర అంశాలపై బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో కలిసి అధికారులతో సమీక్ష జరిపారు. ఒక్కో వార్డు వారీగా ఆయా కార్యక్రమాల అమలు తీరును సాధించిన ప్రగతిని సమీక్షిస్తూ అధికారులకు సూచనలు చేశారు. పేదలకు సొంత ఇంటిని సమకూర్చాలని ప్రభుత్వం ఆశయంతో అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అలసత్వానికి తావు లేకుండా లక్ష్య సాధన కోసం అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఇళ్లు మంజూరైన లబ్ధిదారులందరు తప్పనిసరిగా ఇళ్లను నిర్మించుకునేలా చూడాలన్నారు. నిర్మాణ పనులు చేపట్టే విషయంలో లబ్ధిదారులకు ఏమైనా ఇబ్బందులు ఉండే క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వాటిని ఎప్పటికప్పుడు పరిష్కరించాలని లబ్ధిదారులకు అవసరమైన తోడ్పాటును అందించాలని వార్డు అధికారులను ఆదేశించారు. ఆర్థిక స్థోమత లేని వారికి మెప్మా ద్వారా రుణాలు ఇప్పించాలని వాటిని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం వినియోగించేలా పకడ్బందీ పర్యవేక్షణ జరుపాలన్నారు. తదుపరి సమీక్ష నాటికి ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. చిత్తశుద్ధితో కృషి చేస్తూ లబ్ధిదారులకు ప్రోత్సాహం అందిస్తే తప్పనిసరిగా వారు ఇళ్ల నిర్మాణం కోసం ముందుకు వస్తారని సూచించారు. తిరిగి చెల్లించాల్సిన అవసరం లేకుండా ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి దశల వారీగా 5లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తుందని, అంతే కాకుండా ఉచితంగా ఇసుక రవాణా, డ్వాక్రా, మెప్మా ద్వారా రుణ సౌకర్యం కల్పిస్తుండడం వంటి అంశాలను వివరిస్తూ లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేలా చూడాలని తద్వారా ప్రభుత్వ సంకల్పం నెరవేరేందుకు దోహదపడాలని కలెక్టర్ సూచించారు. ఆయా వార్డులలో నెలకొన్న పరిస్థితులపై వార్డు ఆఫీసర్లకు పూర్తి అవగాహన ఉండాలని అప్పుడే సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయగలుగుతామన్నారు. పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులను వెచ్చిస్తూ చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమం విజయవంతం అయ్యేలా ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. నర్సరీలో పంపిణీకి మొక్కలు సిద్ధంగా ఉంచాలని వాటిని నాటి పరిరక్షించేలా అనువైన ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో వాటిని సంరక్షించే విధంగా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైన మొక్కలు చనిపోతే వాటి స్థానంలో కొత్త మొక్కలు నాటాలన్నారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని, నివాస ప్రాంతాల నడుమ ఖాళీ ప్రదేశాలలో నిల్వ నీరు లేకుండా చూడాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, డెంగ్యూ, మలేరియా విషజ్వరాలు వంటి పాజిటివ్ కేసులు నమోదైతే పరిసర ప్రాంతాల్లో దోమల నివారణ మందులు పిచికారీ చేయించాలన్నారు. అనంతరం పాండుతర్పాను సందర్శించి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను కలిసి మాట్లాడారు. నిర్మాణాలు చేపట్టేందుకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. త్వరితగతిన ఇళ్లు నిర్మించుకోవాలని అవసరమైన తోడ్పటును అందిస్తామని పేర్కొన్నారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, జిల్లా మలేరియా నియంత్రణ అధికారి తుకారాం రాథోడ్, బోధన్ మున్సిపల్ కమిషనర్ జాదవ్ కృష్ణ పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.



జాన్కంపేట్‌లో నాట్లు వేస్తున్న పశ్చిమబెంగాల్ కూలీలు

## ఉపాధి కోసం విదేశాలకు జిల్లా వాసులు

- ఇతర రాష్ట్రాల నుంచి పనుల కోసం జిల్లాకు వస్తున్న వ్యవసాయ కూలీలు
- తాజాగా బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీల రాక
- జిల్లాలో భిన్నమైన పరిస్థితులు

వేల్పూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భిన్నమైన పరిస్థితి నెలకొంది. ఇక్కడి వారు ఉపాధి వెతుక్కుంటూ గల్ఫ్‌దేశాలతో పాటు ఇజ్రాయెల్, సింగాపూర్, మలేషియా, కెనడా, మాల్టా, మాల్‌దీవ్ తదితర దేశాలకు వలస వెళ్తున్నారు. దీంతో జిల్లాలో వ్యవసాయ పనులు చేయడానికి కూలీలు కొరత ఏర్పడడంతో.. పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికులకు ఇందూరు రైతులు ఆహ్వానం పలుకుతున్నారు. నాట్లు వేయడం.. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన హమాలీ పనులు చేయడం.. పసుపు తవ్వకాలు, ఉడికించడం వంటి పనుల కోసం పొరుగు రాష్ట్రాల నుంచి కూలీలు వలస వస్తున్నారు. దేశంలోని బీహార్, ఉత్తరాఖండ్, బెంగాల్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రాల నుంచి జిల్లాకు విపరీతంగా వలస వస్తున్నారు. అలాగే ఇంటి నిర్మాణ పనులు, వంతెనలు, చిన్న, పెద్ద ప్రాజెక్టుల పనుల కోసం ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా, జార్ఖండ్ రాష్ట్రాల నుంచి వలస కార్మికులు వస్తున్నారు. ప్రస్తుతం వరినాట్ల సీజన్‌లో ఉత్తరాఖండ్, బీహార్‌ల నుంచి వలస కార్మికులు వందలాది మంది వచ్చారు. వరినారు (తుకం) తీయడంతో పాటు ఒక ఎకరం వరినాట్లు వేస్తే రూ.4500 చొప్పున కూలీలకు కూలీ చెల్లిస్తున్నారు. రోజుకు పశ్చిమ బెంగాల్, బీహార్ కూలీలు నాలుగు నుంచి ఐదు ఎకరాల వరకు వరినాట్లు వేస్తున్నారు. గతంలో గల్ఫ్ వెళ్లేవారే కాకుండా తాజాగా అనేక మంది విద్యావంతులైన యువకులు అమెరికా, అస్ట్రేలియా, ఇంగ్లాండ్, జర్మని, లండన్, కెనడా ఇతరాత్రా దేశాలకు ఉపాధి పొందడానికి వెళ్తున్న వారి సంఖ్య ప్రతీ ఏటా పెరుగుతూ వస్తుంది. ఇదే తంతు కొనసాగితే గల్ఫ్, ఇతర దేశాలకు వెళ్లేందుకు వీసాల కోసం ప్రయత్నించే వారి సంఖ్య మరింత పెరగనుంది.

### కూలీల కొరత తీరింది..

:రమేష్ యాదవ్ (రైతు, పచ్చలనడ్కుడ)

ఇతర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం ఇక్కడికి వలస వచ్చిన కూలీలతో వ్యవసాయం కూలీల కొరత తీరింది. ఇతర రాష్ట్రాల నుంచి వలస రాకుంటే ఇక్కడి కూలీలకు డిమాండ్‌తో పాటు కూలీ రేట్లు చాలా పెరిగేవి. దేశంలోని బీహార్, బెంగాల్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి కూలీల రావడం వల్ల కూలీ రేట్లు తగ్గడంతో పాటు ఇక్కడి కూలీలకు డిమాండ్ తగ్గింది. ఇతర రాష్ట్రాల కూలీలు నాట్లు వేయడం వల్ల పంట దిగుబడి కూడా ఎక్కువ వస్తుంది.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

## స్థల సేకరణలో జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలి

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ప్రజోపయోగా పనుల కోసం అవసరమైన స్థల సేకరణలో జాప్యానికి తావులేకుండా ఆయా శాఖల అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం స్థల సేకరణకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. గత వారం నిర్వహించిన సమీక్ష సందర్భంగా తీసుకున్న నిర్ణయాల అమలు, సాధించిన ప్రగతిని సమీక్షించారు. రోడ్ల నిర్మాణాలు, విస్తరణతో పాటు నూతన విద్యాసంస్థలు, వసతి గృహాలు, వైద్యశాలలు, మహిళా శక్తి భవనాలు వంటి వాటికి సొంత భవనాల నిర్మాణం కోసం అవసరమైన స్థలాలను సకాలంలో అందించేందుకు చొరవ చూపాలన్నారు. ఈ విషయంలో రెవెన్యూ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాలని, ఇతర శాఖలతో సంప్రదింపులు జరుపుతూ త్వరితగతిన స్థల సేకరణ ప్రక్రియ పూర్తయ్యేలా కృషి కలెక్టర్ చేయాలన్నారు. ఈ సమావేశంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, నిజామాబాద్ ఆర్‌డీవో రాజేందర్‌కుమార్, ఆర్మూర్ ఆర్‌డీవో రాజాగౌడ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్



కోటగిరిలో వివరాలు సేకరిస్తున్న జిల్లా మలేరియా అధికారి

కోటగిరి,జూలై8(ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని వైద్య సిబ్బందికి జిల్లా మలేరియా అధికారి తుకారాం రాథోడ్ సూచించారు. కోటగిరి, పొతంగల్ మండల కేంద్రాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. కోటగిరి మండల కేంద్రంలో డెంగ్యూ పాజిటివ్ కేసులను ఆయన పరిశీలించారు. వారి ఆరోగ్య పరిస్థితులను వాకబు చేశారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పారిశుధ్య సమస్యలపై పలు సూచనలు చేశారు. పరిసరాల శుభ్రత, లార్వా సర్వే, మురికి కాలువలపైన, నీటి కాలువలపైన స్ప్రే చేపట్టాలని సూచించారు. పొతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య సిబ్బందితో సమావేశమయ్యారు. సీజనల్ వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని ప్రతిరోజు గ్రామాలలో ఆరోగ్య సర్వే సక్రమంగా నిర్వహించాలన్నారు. డెంగ్యూ నివారణ అదుపునకు గ్రామాలలో తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫ్రైడే డ్రైడేపైన ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు పాఠశాలలో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి గోవర్ధన్, సూపర్‌వైజర్ సునీత, పంచాయతీ కార్యదర్శి ముజాఫర్ బేగ్, ఆరోగ్య కార్యకర్త లలిత తదితరులు పాల్గొన్నారు.

**రుద్రూరు:** ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా మలేరియా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ అన్నారు. మంగళవారం రుద్రూరు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా మలేరియా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆరోగ్య కేంద్రంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య సిబ్బందికి ఆదేశించారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించాలన్నారు. ఆయన వెంట మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అయేషా సిద్ధిఖ, సూపర్‌వైజర్ రవి, వైద్య సిబ్బంది తదితరులున్నారు.

## వ్యవసాయదారులకు అంతరాయం లేకుండా కరెంట్ అందిస్తాం: ఎస్ఈ



రెంజల్ ఫీడర్‌లను ప్రారంభిస్తున్న ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్

రెంజల్,జూలై8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయదారులకు అంతరాయం లేకుండా నిరంత కరెంట్ అందిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్ అన్నారు. రెంజల్ మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో 30లక్షల వ్యయంతో నిర్మించిన మూడు ఫీడర్‌లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కరెంట్ కోత లేకుండా నిరంతరాయంగా 24గంటలు అందిస్తామని, ముఖ్యంగా రైతుల వ్యవసాయదారులకు ఎటువంటి అంతరాయం కలిగించకుండా కరెంట్ సరఫరా అందిస్తున్నామని ఆయన అన్నారు. వేసవికాలంలో 688 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఓవర్ లోడ్ గుర్తించడం జరిగిందని, 3కోట్ల వ్యయంతో మరమ్మత్తులకు డిస్ట్రిబ్యూషన్ చేయడంతో పాటు జిల్లాలో కొత్తగా పది స్టేషన్‌లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ పది స్టేషన్‌లలో మూడు సబ్ స్టేషన్‌లలో పనులు ప్రారంభమయ్యాయని అన్నారు. నిరంతరాయంగా కరెంట్ సరఫరాలో ఎటువంటి లోపాలు లేకుండా అందించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం గృహ అవసరాలతో పాటు వ్యవసాయానికి అంతరాయం లేకుండా కరెంట్‌ను అందించడం జరుగుతుందని అన్నారు. ఏమైన కరెంట్ సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తక్షణమే పరిష్కర చర్యలు చేపడతామన్నారు. వర్షాకాలం దృష్ట్యా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. గ్రామాలలో ఉన్న సబ్ స్టేషన్‌లో లైన్‌మెన్‌లతో నివేదికలు తెప్పించుకుని ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆయన వెంట ట్రాన్స్‌కో డీఈ, ఏఈ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు

వర్ని,జూలై 8(ఆంధ్రజ్యోతి):మద్యం తాగిబండి నడిపిన ఓవ్యక్తికి రెండు రోజుల జైలుశిక్ష విధించారు.ఈనెల 3వతేదిన తగిలేపల్లి గ్రామ నివాసుడైన గోపాల్‌శంకర్ 28సంవత్సరాలు.మద్యంతాగి వాహనం నడపగా కేసు నమోదు చేసిన వర్ని పోలీసులు సెకండ్‌క్లాస్ న్యాయాధికారి ముందు హాజరుపరచగా న్యాయాధికారి రెండు రోజులజైలు శిక్ష విధించారు.

## బీర్కూర్‌లో మహిళా శక్తి సంబరాలు

బీర్కూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండల కేంద్రంలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం మహిళా శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐకేపీ డీపీఎం సాయిలు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు రుణాలు అందిస్తున్నామన్నారు. గ్రామాలలో కొత్త సంఘాల ఏర్పాటు చేయాలన్నారు. వికలాంగుల సంఘాలు, 60 సంవత్సరాలపై బడిన వారికి పెద్దల సంఘాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం మహిళల ఆదాయాభివృద్ధి కోసం చిన్నచిన్న వ్యాపారం కోసంబ్యాంకు రుణాలు, స్త్రీనిధి రుణాలు అందించడంతో పాటు ప్రమాద బీమా,లోన్ బీమా సౌకర్యం కల్పిస్తున్నామని అన్నారు. వన మహోత్సంలో భాగంగా ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలన్నారు. మార్కెటింగ్, కార్యక్రమం విద్యార్థులకు యూనిఫామ్ కుట్టడం, 2025-2026 కార్యచరణ 100 రుణాల రికవరీ, రుణాలు అందించడం తదితర అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో మహిళాసమాఖ్య అధ్యక్షురాలు సుభద్ర, ఎంపీడీవో మహబూబ్, డీపీఎం సాయిలు, ఏపీఎంగంగాధర్, ఏపీవో అక్మల్, జీపీ సెక్రటరీ, సీసీలు, వీవోఏలు, అధ్యక్షురాళ్ళు పాల్గొన్నారు.

## సోయాబీన్ పంట పరిశీలన


మద్నూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : మద్నూర్ మండలం మేనూర్, మొగా గ్రామాలలో ఎన్ఎంఈవో (నేషనల్ మిషన్ ఎడిబుల్ ఆయిల్) -పథకం కింద సోయాబీన్ విత్తనాలు ఇచ్చిన రైతుల భూముల్లో సోయా పంటను మండల వ్యవసాయ అధికారి రాజు పరిశీలించి రైతులకు సలహాలు, సూచనలు అందజేశారు. ఈ పథకం కింద డీఎస్ 34 రకం సోయాబీన్ విత్తనాలు ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం పంట శాఖీయా దశలో ఉందని, రైతులు కలుపు మందులు, పురుగు మందుల తగిన సమాచారాన్ని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను అడిగి తెలుసుకుని అవసరం మేరకే మందు పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో విశాల్‌గౌడ్, రైతులు పాల్గొన్నారు.

## కూతురిని చంపిన తల్లి రిమాండ్

భీమ్‌గల్ రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): భీమ్‌గల్ మండలం గోన్‌గొప్పుల గ్రామంలో మద్యానికి బానిసై కన్నా కూతుర్ని చంపిన తల్లి రమ్యను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు భీమ్‌గల్ సీఐ సత్యనారాయణగౌడ్ తెలిపారు. భీమ్‌గల్ ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో పారిపోతున్న రమ్యను ఎస్సైసందీప్ పట్టుకొనగా ఆమెను విచారించగా తనకూతురివల్లనే ఇంట్లో భార్యభర్తలకు గొడవలు జరుగుతున్నాయని భావించి తన ఐదునెలల కూతురు శివానిని చంపినట్లు అంగీకరించిందని సీఐ తెలిపారు.



ఆచన్‌పల్లిలో వైఎస్సార్ చిత్రపటానికి వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

# ఘనంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నగర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉర్దూ అకాడమి చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, సుడా చైర్మన్ కేశవేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాంభూపాల్‌లు వైఎస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా తాహెర్‌బిన్ హందాన్ మాట్లాడుతూ వైఎస్ఆర్‌కు జిల్లాతో ఎంతో అవినాభావ సంబంధం ఉందని ఆయన గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాలను నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు అందించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వేణురాజ్, యాదగిరి, సంతోష్, శ్రీనివాస్, వినయ్, ప్రమోద్, స్వామిగౌడ్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

**బోధన్‌రూరల్:** బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లి, సాలూర మండల కేంద్రంలోని సాలూర క్యాంప్, సాలంపాడ్ క్యాంప్ తదితర గ్రామాలలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంలో ఆయనకు ఎవరు సాటి రారని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఆయన చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని కొనియాడారు. ఆరోగ్యశ్రీ, ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ చేసిన ఘనత ఆయనదేనన్నారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి రావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు సాంబిరెడ్డి, నాయకులు శరత్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, రామకృష్ణ రెడ్డి, ధనుంజయ్ రెడ్డి, కొండారెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, సుబ్బారెడ్డి, చిన్నారెడ్డి, బలరాంరెడ్డి, ఇంద్రకరణ్, పట్టణ అధ్యక్షులు పాషామొయినోద్దీన్, విష్ణువర్ధన్ రెడ్డిలతో సాలూర మండల అధ్యక్షులు మందర్నా రవి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, అల్లె రమేష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**వేల్పూర్:** వేల్పూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఉమ్మడి ఏపీ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చిత్ర పటానికి మండల పార్టీ అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, పలువురు నాయకులు పూలమాలలు వేసి ఘనంగ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణ, దామోదర్‌గౌడ్, నరేందర్, రేవం త్‌రెడ్డి, రాము, చరణ్, వివిధ గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మోర్తాడ్:**మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో మంగళవారం దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 76వ జయంతిని కాంగ్రెస్ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ముత్యాల రాములు, బద్దం రాజశేఖర్‌రెడ్డి, గిర్మాజి గంగాధర్, సంతోష్, బక్కూరి ఆనంద్, మహిపాల్, రమేష్, నవీన్, రవి, గంగాధర్ పాల్గొన్నారు.

**కోటగిరి:** కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. పేద ప్రజల సంక్షేమం కోసం వైఎస్సార్ అహర్నిశలు కృషి చేశారని ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఎంతైన ఉందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వహీద్ హుస్సేన్, ఆనంద్, భూమయ్య, జమీర్, అయూబ్ హైమద్, జుబేర్, లాయక్ పటేల్, కూచి సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

**రుద్రూరు:** ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇందూరి చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోట అరుణ్ కుమార్‌లు అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ నిస్సార్, కర్ర అశోక్, పత్తి రాము, తోట సంగయ్య, అక్కపల్లి నాగేందర్, డా.రఫీక్, పుర్ఖాన్, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతిని కమ్మర్‌పల్లి మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు సుంకెటరవి, టీపీసీసీ అధికార ప్రతినిధి వేణుగోపాల్ యాదవ్,మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పాలెపునర్సయ్య, ఉపాధ్యక్షుడు సుంకెట బుచ్చన్న వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పడిగెల ప్రవీణ్, బుచ్చిమల్లయ్య, కొమ్ముల రవీందర్, అజ్మత్ హుసేన్ సింగిరెడ్డిశేఖర్, కిషన్‌గౌడ్,గణేష్‌గౌడ్,నిమ్మప్రసాద్, జగదీశ్ శ్రీనివాస్,సాయి,రాజేశ్వర్, లింగారెడ్డి,మారయ్య, నాగరాజు పాల్గొన్నారు.

**ముప్కాల్:** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వేఎస్ రాజశేఖర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భగా ఆయన చేసిన సంస్కరణలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ చంద రవి, దేవగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

**నవీపేట:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను మంగళవారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక రఘుపతి రెడ్డి గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు విపుల్ గౌడ్, సంజయ్ దత్త్, కార్తీక్ యాదవ్, అవేజ్ ఖాన్, చిన్నదొడ్డి ప్రవీణ్, భీమర్తి మోహన్, ఈశ్వర్, రియాజ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

**మెండోర:** ఉమ్మడి రాష్ట్ర అభివృద్ధితో పాటు పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి పేదల గుండెల్లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిలిచారని డీసీసీ జనరల్ సెక్రటరీ సోం రాజేందర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి వెస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ పేదల కోసం ఫీజ్ రియంబర్స్ మెంట్, ఆరోగ్య శ్రీ, 108, పెన్షన్ పెంపుదల వంటి పథకాలు ప్రవేశపెట్టి పేదలను ఆదుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు గుండోజి రవి, బద్ది ఆనయి కుమార్, కొప్పెల రమేష్, సామ నరేష్, కండెల ముత్యం, బంగ్లా గంగారెడ్డి, పల్లె భాస్కర్, రాజారెడ్డి, దీపి, శంకర్, రాజు, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

**నందిపేట:**మండల కేంద్రంలో మంగళవారం దివాంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రాష్ట్ర అభివృద్ధికి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్, నాయకులు పిప్పెర సాయిరెడ్డి, ఎర్రం లింగం, కృష్ణాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



నందిపేటలో వైఎస్ఆర్ జయంతిని నిర్వహిస్తున్న నాయకులు



మెండోరాలో వైఎస్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నాయకులు



వేల్పూర్‌లో..

**జక్రాన్‌పల్లి:** మండలంలోని తొర్లికొండ గ్రామంలో మంగళవారం ఉమ్మడి రాష్ట్ర దివాంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతిని కాంగ్రెస్ పార్టీ నాయకులు నిర్వహించారు. అనంతరం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ మార్కెట్ కమిటి డైరెక్టర్ కనక రవికుమార్, మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నల్ల గంగారెడ్డి, సాయిరెడ్డి, రాజేశ్, కైలాస్ రాజు, రాజేశ్వర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

**డొంకేశ్వర్:** ప్రజల గుండెల్లో శాశ్వత స్థానాన్ని పొందిన నేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూమేష్‌రెడ్డి అన్నారు. డొంకేశ్వర్‌లో మంగళవారం వైఎస్ఆర్ 76వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మారంపల్లి లిఫ్ట్ చైర్మన్ బోజారెడ్డి, యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సుమన్, డిసిసి ఉపాధ్యక్షుడు దేగాం గంగారెడ్డి, భీమ్ నాయక్ సాయన్న, గంగాధర్, నాగరాజు పాల్గొన్నారు.

**ఆర్మూర్ రూరల్:** ఆలూర్ మండల కేంద్రంలో మంగళవారం దివాంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసందర్భంగా కాంగ్రెస్ నాయకులు వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కెర విజయ్, మల్లారెడ్డి, నీలగిరి శ్రీనివాస్, బార్ల ముత్యం,భాస్కర్, ఉదయ్,రాజు, గంగారెడ్డి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయ కుడు వినోద్‌రెడ్డి, సల్లా నర్సారెడ్డి, దేవేందర్‌రెడ్డి, భూమారెడ్డి తదిత రులు పాల్గొన్నారు.

**ముప్కాల్:** ముప్కాల్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వేఎస్ రాజశేఖర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ చంద రవి, దేవగౌడ్, సురం రాజేందర్, లక్ష్మణ్, రాజు, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

## వర్నిలో పండ్లు పంపిణీ

వర్ని, జూలై 8 (ఆంధ్రజ్యోతి): దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కిసాన్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శనివారం కిషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తగిలేపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సార్వత్రిక సమ్మె

కోటగిరి,జూలై8(ఆంధ్రజ్యోతి):కోటగిరి తహసీల్దార్ కార్యాలయం ఎదుట బుధవారం దేశవ్యాప్త సమ్మెలో భాగంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు సీపీఐ మండల కార్యదర్శి విఠల్‌గౌడ్ పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెనిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మండల కేంద్రంలో భారీర్యాలీతో పాటు తహసీల్దార్ కార్యాలయంఎదుట సమ్మెకొనసాగుతుందని,కార్మికసంఘాలు పెద్ద సంఖ్యలో హాజరైన సమ్మెను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కేంద్రీయ విద్యాలయ నిర్మాణానికి ఎమ్మెల్యే స్థల పరిశీలన



ఆర్అండ్‌బీ ఖాళీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

మద్నూర్,జూలై 8 (ఆంధ్రజ్యోతి):మద్నూర్ మండల కేంద్రంలో కేంద్రీయ విద్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి గతంలో రెండుసార్లు కేంద్రీయ విద్యాలయం సహాయ కమిషనర్ మంజునాథ్ మండల కేంద్రంలోని పలు భవనాలను, ఖాళీ స్థలాలను పరిశీలించారు. మంగళవారం జుక్కల్ శాసనసభ్యులు తోట లక్ష్మీకాంతరావు సైతం కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు మండల కేంద్రంలోని ఆర్ అండ్ బి ఖాళీ స్థలాన్ని పరిశీలించి కేంద్రీయ విద్యాల యం ఏర్పాటుకు కృషి చేస్తానని అన్నారు.ఆయనతో పాటు తహసీల్దార్ ముజీబ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దరాస్ సాయిలు, మాజీ సర్పం చ్ విట్టల్ గురూజీ, సీనియర్ నాయ కులు స్వామి, కాంగ్రెస్ నాయకులు బండి హన్మండ్లు, గోపి, కుషాల్, సం తోష్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## వన మహోత్సవాన్ని విజయవంతం చేయాలి



నాగిరెడ్డిపేట ఐకేపీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటుతున్న డీఆర్‌డీవో

నాగిరెడ్డిపేట,జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వన మహోత్సవాన్ని విజయవంతం చేయ డానికి అధికారులతో పాటు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్‌డీవో సురేందర్ కోరారు. ఆయన మంగళవారం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్థానిక ఐకెపి, ఎంపీ డీవో, ఉపాధిహామీ కార్యాలయం ఆవరణలో మొక్కలు నాటారు. జిల్లా వ్యాప్తంగా వనమహోత్సవాన్ని విజయవంతం చేయడానికి ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రభాకర్ చారి,ఐకెపీ ఏపీఎం జగదీష్ కుమార్, ఈజీఎస్ ఏపీవో సాయిలు, అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళ వారం మండలంలోని మాల్తుమ్మెద గ్రామంలో స్థానిక ఎఫ్ఆర్ వో వాసుదేవ్ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు.ఈకార్యక్రమంలో డిప్యూటీ ఎఫ్ఆర్‌వో రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

నసురుల్లాబాద్,జూలై 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం గా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ నసీమా అన్నారు. మంగళవారం మండలంలోని మిర్జాపూర్‌లో నూతనంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లనిర్మాణ పనులను అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు.ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు లబ్ధిదారు త్వరగా చేపడితే విడతల వారీగా లబ్ధిదారులకు బిల్లులను అందజేస్తామని ఆమె తెలిపారు. మిర్జాపూర్ గ్రామానికి 40 ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయితే, 20 మంది లబ్ధిదారులు మార్కౌట్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఆమె వెంట గ్రామపంచాయతీ సెక్రెటరీ రవి, మిర్జాపూర్ వెంకట్, లబ్ధిదారులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## సావెల్‌లో ఘనంగా బోనాల పండుగ

మెండోర , జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలో సావెల్ గ్రామంలో మండల ఆరెకటికె సూర్యవంశం సంఘం ఆధ్వర్యంలో సంఘ సభ్యులు బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆరెకటికే సంఘం సభ్యులు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఆరెకటికె సంఘం సభ్యులు లింబాజీ, పోకలకర్ గణేష్, కిషన్, పోకలకర్ రమేష్, పోకల్‌కర్ విఠల్, ఈశ్వర్, రాము, చందు, తదితరులు పాల్గొన్నారు.

## వేల్పూర్‌లో ఘనంగా ఎల్లమ్మ బోనాలు

వేల్పూర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండల కేంద్రంలో మంగళవారం గీతా కార్మికుల ఆధ్వర్యంలో ఎల్లమ్మకు ఘనంగా బోనాలు తీశారు. స్థానిక రామాలయం నుండి ఎల్లమ్మ ఆలయం వరకు మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ప్రధాన రహదారుల గుండా డప్పు వాయిద్యాల మధ్య బోనాలను ఎత్తుకొని ఆలయం వరకు తీసుకెళ్లారు. అనంతరం ఎల్లమ్మకు మహిళలు మంగళహారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

భీమ్‌గల్ రూరల్ , జూలై 8 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని. జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు అధికారులకు సూచించారు. ఆయన మంగళవారం మండలంలోని పురానిపేట్, తాళ్ళకుంట తండాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యద పనులను ముమ్మరంగా చేపట్టాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని గ్రామపంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో గంగుల సంతోష్‌కుమార్ , ఎంపీఓ శివ చరణ్, ప్రభుత్వ వైద్యాధికారి అజయ్ పవార్, పురానిపేట్ పంచాయతీ కార్యదర్శి జితేందర్, మిషన్ భగీరథ ఏఈ అమూల్య, ఎపీవో నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల మంజూరు పత్రాల పంపిణీ

నందిపేట,జూలై 8(ఆంధ్రజ్యోతి): నందిపేట మండలం గ్రామంలో ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి వినయ్‌రెడ్డి సహకారంతో గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఏఎంసీ డైరెక్టర్ పెంట ఇంద్రుడు మంగళవారం మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటి సభ్యులు చిరంజీవి, గౌతం, లక్ష్మీ, రజిని పాల్గొన్నారు.

## రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు

మోర్తాడ్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో కీలకమైన ప్రత్యేక రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యకు సంబందించిన నమోదు ప్రక్రియ ఏవో హరీష్ ప్రారంభించారు. మండలంలోని మొత్తం రైతులు 8536 ఉండగా ఇప్పటి వరకు 4257 నమోదు చేసుకున్నారని మిగిలిన రైతులు కూడా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఏవో అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు శ్రీలత, లకవతి పాల్గొన్నారు.

## ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: ఏసీపీ

రెంజల్,జూలై8(ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని తాడ్‌బిలోలి గ్రామంలో వాహనదారులకు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు వాహన ధ్రువీకరణ పత్రాలతో పాటు సరైన పత్రాలు ఉండాలని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలను పాటించి వాహనాలను నడపాలని అన్నారు.ప్రతీఒక్కరు నియమ నిబంధనలను పాటించి వాహనాలు నడిపిప్పుడు అందరు క్షేమంగా ఉంటారన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎటువంటి అపరాధ రుసుములు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.ఆయన వెంట ఎస్ఐ చంద్రమోహన్, అంబేద్కర్ నగర్ పంచాయతీ కార్యదర్శి సునీల్, ఖుద్దుస్, అబ్బన్న, గన్నీ, సద్దామ్, హైదర్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతిభద్రతల పరిరక్షణనే పోలీసుల ధ్యేయం

బోధన్‌రూరల్,జూలై8(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, రానున్న పండుగలు దృష్టిలో ఉంచుకుని సీపీ సాయి చైతన్య ఆదేశాల మేరకు బోధన్ ఉమ్మడి మండలంలోని 37గ్రామాలకు విలేజ్ పోలీస్ ఆఫీసర్‌లను నియమించడం జరిగిందని బోధన్ రూరల్ సీఐ విజయ్ బాబు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బోధన్, సాలూర మండలాల్లోని ఆయా గ్రామాలలో నియమించిన పోలీసుల పేర్లు, ఫోన్ నెంబర్ల జాబితాను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## విలేజ్ పోలీసు అధికారుల నియామకం

నవీపేట,జూలై8(ఆంధ్రజ్యోతి): నవీపేట పోలీస్ స్టేషన్ పరిధిలో విలేజ్ పోలీస్ అధికారులను నియమించడం జరిగిందని ఎస్ఐ వినయ్ తెలిపారు. ప్రతి కానిస్టేబుల్‌కు ఒక గ్రామం లేదా రెండు గ్రామాలను కలిపి బాధ్యతలు ఇవ్వడం జరిగిందని దీనికి సంబంధించిన పోలీస్ కానిస్టేబుల్, ఎస్‌హెచ్‌వో, సీఐల ఫోన్ నెంబర్‌లను సైతం ఆయా గ్రామాల కూడలిల వద్ద గోడలపై రాయించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు.

## సమ్మె నోటీస్ అందజేసిన సీఐటీయూ నాయకులు

ఆర్మూర్ రూరల్ , జూలై 8 (ఆంధ్రజ్యోతి): నేడు చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయ నాయకుడు కుతాడి ఎల్లయ్య, సూర్యశివాజీ కోరారు. మంగళవారం ఎంపీడీవో, ఎంఈవో, మున్సిపల్ కార్యాలయాల్లో సమ్మెనోటీస్‌ను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు.

### సమ్మెకు కిసాన్ సంయుక్త మోర్చ మద్దతు

ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు కిసాన్ సంయుక్త మోర్చ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని నాయకులు దేవరాం, వల్లపు వెంకటేష్, జక్కుం శేఖర్, యు. రాజన్న తెలిపారు.

## జక్రాన్‌పల్లిలో బీఎల్‌వో లకు శిక్షణ

జక్రాన్‌పల్లి,జూలై 8 (ఆంధ్రజ్యోతి):జక్రాన్‌పల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం బీఎల్‌వో లకు శిక్షణ కార్య క్రమం నిర్వహించారు.ఈశిక్షణ కార్యక్రమంలో నిజామాబాద్ ఆర్డీవో రాజేం దర్ పాల్గొన్నారు. బీఎల్‌వో లకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, వారి విధులు, ఓటర్ల జాబితాపై అవగాహన కల్పిస్తు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో ఎంపీడీవో సతీష్‌కుమార్, తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ఐ పాల్గొన్నారు.

## హరితహారంలో ఈత మొక్కలు

ముప్కాల్,జూలై 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నల్లూర్ గ్రామంలో గీత కార్మికుల అభివృద్ధి కార్యక్రమం కొరకు హరితహార కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటిన ఎక్సైజ్ సీఐ రంజీత్ రావు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్లు శ్రీనివాస్, సాయిలు, శ్రీలత, ఫీల్డ్ అసిస్టెంట్ భూమేశ్వర్, సెక్రటరీ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



పీసరగుట్ట తండాలో వనదేవతలకు నైవేద్యం సమర్పిస్తున్న గిరిజనులు

# తండాల్లో ఘనంగా సీత్లా పండుగ

సిరికొండ, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గిరిజన తండాల్లో సంప్రదాయబద్ధంగా సీత్లా పండుగను ఘనంగా జరుపుకొన్నారు. ఏటా జూలైలో తొలి ఏకాదశి తర్వాత తండాల్లో గిరిజనులు సీత్లా (వనభోజనాలు) పండగను జరుపుకుంటారు. ఏడుగురు వనదేవతలకు మొక్కులు చెల్లిస్తారు. మంగళవారం ఉదయం తండా పెద్దలు నైవేద్యాన్ని తయారు చేసుకుని పిల్లాపాపలతో సమీపాన గల అడవిలో ఏర్పాటు చేసుకున్న వనదేవతలకు సమర్పించారు. సమృద్ధిగా వర్షాలు కురిసి పాడి పంటలు బాగుండాలని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని ఈ సందర్భంగా గిరిజనులు వేడుకున్నారు.



సర్పంచ్ తండాలో వనదేవతలకు నైవేద్యం సమర్పించి మొక్కుతున్న గిరిజన మహిళలు



● నల్లగుట్ట తండాలో..

జక్రాన్‌పల్లి , జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లగుట్ట తండాలో మంగళవారం సీత్లా పండుగను ఘనంగా జరుపుకున్నారు. గ్రామస్థులు ఊరేగింపుగా జగదాంబ ఆలయానికి చేరుకుని నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వనభోజనాలకు వెళ్లారు.

# ఐదు తరగతులకు ఒకే గది

● సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు ● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు ● పట్టించుకోని అధికారులు




ప్రభుత్వ పాఠశాల భవనాలు ఇలా..

ఇందల్వాయి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం మన ఊరు మన బడి, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద కోట్లు ఖర్చు పెట్టినా.. పాఠశాలలు మాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో కాంట్రాక్టర్లు సగం పనులు చేసి ఎత్తేస్తే మరికొన్ని పాఠశాలల్లో ఎక్కడ పరిస్థితి అలాగే దర్శనమిస్తున్నాయి. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. కనీస వసతులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదవడానికి విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. మండలంలోని పలు పాఠశాలలు వంట గదులు లేక ఇబ్బందులు పడుతుంటే మరికొన్ని పాఠశాలల్లో కంపౌండ్ వాల్ లేకపోవడం, తరగతి గదులు లీకేజీలు కావడం, చిన్నపాటి వర్షానికే స్లాబ్ పైకప్పు ఊర్వడం, వర్షపునీరు తరగతి గదిలోకి రావడం, మరికొన్ని పాఠశాలలు శిథిలావస్థలో భవనాలు ఉండటంతో విద్యార్థులు చదవలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

**నల్లవెల్లి కాంప్లెక్స్ పరిధిలో..**

నల్లవెల్లి కాంప్లెక్స్ పరిధిలో నల్లవెల్లి గ్రామంలో హరిజనవాడ ప్రాథమిక పాఠశాల ఉంది. ఆ పాఠశాలలో 1 నుంచి 5 తరగతులను ఒకే గదిలో నిర్వహిస్తున్నారు. 5 తరగతులను ఒకే గదిలో నిర్వహించడం పట్ల ఇబ్బందులు ఉన్నాయని విద్యార్థులకు గదులు లేక విద్యార్థుల సంఖ్య పెరగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సిన ఉండగా వంట గదికి సైతం మరమ్మతులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. స్టేషన్ తండా ప్రాథమిక పాఠశాలలో 1 నుంచి 5 తరగతుల వరకు ఒకేగదిలో విద్యాబోధన చేస్తున్నారు. ఒకే ఇరుకు గదిలో ఐదు తరగతులు నిర్వహించడం కష్టంగా ఉందని గతంలో ఉన్న స్కూల్ భవనం కూలిపోయి సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టేవారు లేకుండాపోయారని గ్రామస్థులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న స్కూల్ భవనం పైకప్పు రంధ్రాలు పడి వర్షపునీరు గదిలోకి వస్తుందని దాని వల్ల విద్యార్థులకు ఆటంకం కలుగుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం చేయడానికి వంటగది లేక ప్రైవేటు వ్యక్తుల వద్ద వంట చేసి భోజనాన్ని ఏర్పాటు చేస్తున్నారు. గతంలో కలెక్టర్, ఉన్నతాధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు.

**ఎల్లారెడ్డిపల్లి కాంప్లెక్స్‌లో..**

ఎల్లారెడ్డిపల్లి కాంప్లెక్స్ పరిధిలో కేకేతండాలో వంట గదికి మరమ్మతులు చేయాల్సి ఉండగా ఎవరూ పట్టించుకోవడం లేదు. అక్కడ సైతం ఒకే గదిలో ఐదు తరగతులను నిర్వహిస్తున్నారు. గుట్టకింది తాండా పాఠశాలలో వంట గదిలేక మధ్యాహ్న భోజన సిబ్బంది వర్షాకాలం వంట చేయడానికి నానా అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యావ్యవస్థను మెరుగు పర్చడానికి కోట్లు ఖర్చు పెడుతున్నా పాఠశాలల అభివృద్ధి అంతంత మాత్రంగానే ఉన్నాయని ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించి విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు తాగునీరు, పరిశుభ్రత, విద్యుత్, భవనాల మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

**వంటగది లేక ఇబ్బందులు..**

**: జగత్‌సింగ్, స్టేషన్ తండా**



స్టేషన్ తండా ప్రాథమిక పాఠశాలలో వంటగది లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో ఎక్కడ వంట చేయాలో తెలియడం లేదు. విద్యార్థులకు ఒకే గది ఉండటం స్లాబ్ పైకప్పు రంధ్రాలు పడటంతో వర్షపునీరు గదిలోకి వస్తున్నాయి. అధికారులు స్పందించి సమస్యలు తీర్చాలి.

**అదనపు గదులు నిర్మించాలి..**

**: పల్లె సాయిలు, నల్లవెల్లి**



నల్లవెల్లి హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో ప్రహరిగోడ విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. క్రిమి కీటకాలు, విషసర్పాలు పాఠశాల గదిలోకి వస్తున్నాయి. ఐదు తరగ తులకు ఒకే గది ఉండటంతో విద్యార్థుల సంఖ్య పెరగ డం లేదు. అధికారులు స్పందించి అదనపు తరగతి గదులు, ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.



ముళ్లపొదలు, చెత్తాచెదారంతో నిండిపోయిన అడ్లూర్ ఊర చెరువు కాలువ ఇలా..

# అధ్వానంగా ఊర చెరువు కాలువ

● ఏళ్లుగా నిండిపోయిన పూడిక ● పట్టించుకోని అధికారులు

కామారెడ్డి రూరల్, జూలై 8: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని అడ్లూర్ ఊర చెరువు నుంచి బయన్న చెరువు కాలువలో ఉన్న పుడిక, చెత్త చెదారం తీయకపోవడతో ఆ ప్రాంతమంత చిత్తడిగా మారింది. ప్రతి ఏడాది వర్షకాలంలో ఈ కాలువ ద్వారా వర్షపు నీరు బయన్న చెరువుకు పారుతోంది. ఈ కాలువలో పుడిక చేరడంతో ఆ నీరంత రోడ్డు పై పారి ఆ పరిసర ఇళ్ల ముందు చేరి మడుగులు కడుతోంది. దీంతో దోమలు, ఈగలు, ఇతర కీటకాలు చేరి వ్యాధుల బారిన పడుతున్నామని ప్రజలు ఆరోపిస్తున్నారు. బయన్న చెరువు కింద 40 ఎకరాల వరకు ఆయకట్టు ఉంది. సుమారు 15 ఎకరాల వరకు విస్తీర్ణంలో బయన్న చెరువు ఉంది. ఊర చెరువు నిండిన తర్వాత ఆ చెరువు సుమారు కిలో మీటర్ న్నర ప్రధాన కాలువ బయన్న చెరువు వరకు ఉంటుంది. ఈ కాలువ ద్వారానే బయన్న చెరువు నిండుతూ వస్తోంది. అయితే కాలువకు ఏళ్ల తరబడి మరమతులు చేయకపోవడంతో అధ్వానంగా మారింది. వర్షపు నీరు, మురికి నీరు కాలువలోకి వచ్చి మట్టి, చెత్త చెదారంతో నిడిపోయి అధ్వానంగా తయారైంది. అదే విధంగా కాలువ పొడున ముళ్లపొదలు, పిచ్చి మొక్కలు ఎపుగా పెరగడంతో నీళ్లు పారలేని పరిస్థితి ఎదురవుతుంది. ఎండ్ల తరబడి పూడికతో నిండిపోయిన పట్టింపు కరువైందని గ్రామ ప్రజలు, రైతులు పేర్కొంటున్నారు. కాలువ మరమతులు చేయాలని గతంలో సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. ఈ చెరువు ద్వారా స్థానిక గ్రామంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు ఆయకట్టుకు సాగునీరు అందిస్తుంది. పాడి పశువులకు చెరువు ఎంతగానో ఉపయోగపడుతుంది. అలాంటి చెరువును సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**కాలువలోని ముళ్లపొదలను తొలగించాలి..**

**: కల్లూరి శంకర్, రైతు, అడ్లూర్**



ఊర చెరువు నుంచి బయన్న చెరువుకు నీళ్లుపోయే కాలువలో పెరిగిపోయిన ముళ్ల పొదలు, చెత్తాచెదారాన్ని తొలగించాలి. దీంతో చెరువుల్లో నీరు నిలువ ఉండి భూగర్భ జలాలు పెరుగుతాయి. కాలువలో మట్టి, చెత్త చెదారంతో నిండి ఉండడంతో వర్షపు నీరంతా వృధాగా పోతుంది. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.



## బోధన్ సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తుల జప్తునకు కోర్టు ఆదేశాలు జారీ

● పరిహారం చెల్లించేందుకు చర్యలు

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



మాట్లాడుతున్న బోధన్ సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా వర్ని మండలం లక్ష్మీసాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులకు పరిహారం చెల్లింపులో అధికారుల నిర్లక్ష్యంపై బోధన్ కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ మేరకు సబ్ కలెక్టర్ కార్యాలయ ఆస్తులను జప్తు చేసేందుకు ఆదేశాలు జారీ చేసింది. లక్ష్మీసాగర్ ప్రాజెక్టు భూ నిర్వాసితులు తమకు నష్టపరిహారం చెల్లించాలంటూ కోర్టును ఆశ్రయించారు. హైకోర్టుకు సైతం వెళ్లగా హైకోర్టు నుంచి బోధన్ కోర్టుకు పలు సూచనలు జారీ చేసింది. ఈ మేరకు పరిహారం చెల్లించలేని పక్షంలో ఆస్తులు జప్తు చేయాలంటూ బోధన్ సీనియర్ సివిల్ జడ్జి ఆదేశాలు జారీ చేశారు. ఈ నెల 12వ తేదీన మరోసారి నోటీసులు జారీ చేస్తామని ఉత్తర్వులు వెలువరించింది. ఈ మేరకు బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో స్పందించారు. గతంలో పరిహారం చెల్లింపులో కొంతమేర సమస్యలు ఉన్న మాట వాస్తవమేనన్నారు. భూ నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయమై కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. కలెక్టరేట్ నుంచి సీసీఎల్‌కు ప్రతిపాదనలు వెళ్లాయన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారుల వద్ద ఫైల్ పెండింగ్‌లో ఉందన్నారు. ప్రభుత్వం పరిహారం విడుదల చేయగానే రైతులకు పంపిణీ చేస్తామన్నారు. పరిహారం విషయంలో రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.



పాలను అమ్మేందుకు గాడిదను వాహనంలో తీసుకెళ్తున్న దృశ్యం

## గాడిద పాలు.. మహా ఖరీదు

● 'జండూ బామ్' సీసా పాలు

రూ.60 నుంచి రూ.100 వరకు విక్రయాలు

పెద్ద కొడపగల్, జూలై 8( ఆంధ్రజ్యోతి): 'గంగిగోవు పాలు గరిటడైన చాలు.. కడివెడైన నేమి ఖరము పాలు' అంటూ వేమన తన శతకంలో ప్రస్తావించారు. అంటే గోవు పాలు గరిటెడైన చాలు గాడిద పాలు కడివెడెందుకని అర్థం. అయితే నేటి రోజుల్లో గాడిద పాలకు డిమాండ్ పెరగడంతో వాటి పోషకులు గాడిద పాలను జండూ బామ్ సీసా పాలను 60 రూపాయల నుంచి 100 రూపాయల వరకు విక్రయిస్తున్నారు. వర్షకాలం ప్రారంభంలో చిన్న పిల్లలకు వివిధ రకాల అనారోగ్య సమస్యలు వస్తాయి. దీంతో గ్రామీణ ప్రాంతాలల్లో చిన్నారులకు దగ్గు, పక్క సెలుపులు రాకుండా ఉండేందుకు గాను గాడిద పాలను తాగిస్తారు. గాడిద పాలలో ఉండే పోషకాలు దగ్గు, పక్కసెలుపులు రాకుండ నివారిస్తాయని నమ్మకంతో గ్రామీణులు ఈ పాలను చిన్నారులకు తాగిస్తారు. గతంలో గాడిద పాలకు డిమాండ్ అంతంత మాత్రంగానే ఉండేది. అయితే నేడు గాడిద సంఖ్య తగ్గడంతో వాటి పాలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో వాటి పోషకులు పాలను అమ్మి సొమ్ముచేసుకుంటున్నారు. గతంలో ఉదయాన్నే తమకున్న గాడిదలో ఆయా గ్రామాలకు కాలినడకన వచ్చి పాలను విక్రయించుకునే వాటి పోషకులు నేడు మరింత సంపాదన కోసం, తొందరగా ఇతర గ్రామాలలో పాలు అమ్ముకోవాలనే ఉద్దేశ్యంతో గాడిద పాలు ఒక ఊర్లో విక్రయించే మరొక ఊరికి వాహనంలో గాడిదను తరలిస్తున్నారు. దీంతో వ్యాపారంలో గాడిదల పోషకులు కొత్త మార్గాలను అన్వేషిస్తున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.



# ప్రశ్నార్థకంగా అడవుల సంరక్షణ!

» ఆక్రమణకు గురవుతున్న అటవీ భూములు

» పట్టించుకోని సంబంధిత అధికారులు





రత్నాపూర్ అటవీప్రాంతంలో నరికివేసిన చెట్లు

ఎల్లారెడ్డి రూరల్, జూలై 8(ఆంధ్రజ్యోతి): మానవునితో పాటు భూమిపై సకల జీవరాశి మనుగడకు అడవులే ఆధారం. అడవులు జీవ వైవిధ్యానికి దోహద పడతాయి. అడవులను కాపాడకపోతే జీవవైవిధ్యానికి విఘాతం కలుగుతుంది. అంతటి విశిష్టత కలిగిన అడవుల సంరక్షణ ప్రశ్నార్థకంగా మారుతోంది. ఎల్లా రెడ్డి మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇటీవల అటవీ భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తెలుస్తోంది. అనేకమంది కబ్జాలకు పాల్పడుతూ అటవీ భూములను ఆక్రమిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీటికి సంబంధించిన అనేక ఆరోపణలు వినిపిస్తున్నా యి. ఈ నేపథ్యంలో ఎల్లారెడ్డి మండల ఎఫ్‌ఆర్వో ఇటీ వల సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. కళ్యాణి అటవీ పరిధిలోని రత్నాపూర్ శివారులో ఆక్రమణకు గురైనా అటవీ భూమిని గుర్తించి ఇటీవల స్వాధీనం చేసుకున్న విషయం తెలిసిందే. అంతే కాక మరికొంత అటవీభూమి చదును చేసి ఆక్రమణకు పాల్పడినట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దానికి సంబంధించిన ఇంకా సమాచారం తెలియాల్సి ఉంది. లక్ష్మాపూర్‌లో ఓ ఇంటి నిర్మాణం వివాదాస్పదంగా మారినట్లు వార్తలు వెలువడ్డాయి. ఇలా వరుస ఘటనలు జరిగిన ఎల్లారెడ్డి అటవీశాఖలో కొందరు అప్రమత్తంగా విధులు నిర్వహించడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎవరైనా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే తగిన చర్యలు తీసుకోవాలి. అడవుల సంరక్షణ అందరి బాధ్యతగా భావించాలి. నేటి మనిషి విజ్ఞానంతో ఆలోచించి కుండా తనతో పాటు జీవరాశులను రక్షించే అడవులను సైతం విచక్షణను కోల్పోయి నాశనం చేస్తున్నాడు. అనేక జీవులకు రక్షణగా ఉండే అడవులను చిన్నభిన్నం చేస్తూ తన మనుగడను ప్రశ్నార్థకం చేసుకుంటున్నాడు. మనకు ఆహారం, ఔషధాలు, స్వచ్ఛమైన ప్రాణవాయువును ఇచ్చే అడవులను నరికి వినాశనానికి కారణం అవుతున్నాడు. అడవుల పరిరక్షణకు ప్రభు త్వం ఎన్ని కోట్ల రూపాలయల ధనాన్ని వెచ్చించిన కాపాడేవారు లేకుంటే వ్యర్థమే అవుతుంది. విచ్చలవిడిగా అడవులను నరుకుతే ఆహార ఉత్పత్తులు తగ్గిపోతాయి. అటవీ జంతువులు ఇళ్లలోకివస్తాయి. పక్షులు అంతరిస్తాయి. వర్షాపాతం తగ్గి కరువు ఏర్పడుతోంది. భూగర్భజలాలు తగ్గిపోతాయి. భూసారం దెబ్బతింటుంది. ఆక్సిజన్ తగ్గిపోయి కార్బడయాక్సైడ్ పెరుగుతుంది. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అటవీశాఖ అడవుల పెంపకం ,ఏపట్టి పరిరక్షించాలి. అటవీ సంరక్షణలో విఫలమైన ఎల్లారెడ్డి ఎఫ్‌ఆర్వోను ఇటీవల సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన కొంతమంది ఉద్యోగులు విధుల పట్ల సక్రమంగా వ్యవహరించడం లేదని గుసగుసలు వినిపిస్తున్నాయి. అటవీ సంరక్షణలో నిర్లక్ష్యంగా ఉంటే ఎంతటి వారైనా సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. అడవిలో ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లు నరకడం గానీ , మొరం, మట్టి తవ్వి తీసుకుపోవడం గాని, వన్యప్రాణులను వేటాడటం చట్టరిత్యా నేరం. అలాంటివారు పట్టుబడితే అటవీ సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేయాలి. రేంజ్ పరిధిలోని ప్రజలకు అటవీశాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించి అడవుల సంరక్షణపై అవగాహన కల్పించాలి. సహజ సంపదను కాపాడాలి. అటవీ చట్టం, పర్యావరణ చట్టాలను కచ్చితంగా అమలు చేయాలి. అడవులను సంరక్షించి జీవవైవిధ్యాన్ని పెంపొందించాలని పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు. వృక్షో రక్షతి రక్షిత: వృక్షాలను మనం కాపాడితే అవి మనల్ని కాపాడతాయన్న విషయాన్ని ఎవరు మరువవద్దు.

## మోడల్ స్కూల్‌ను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్

రెంజల్,జూలై8(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని మోడల్ పాఠశాలను మోడల్ స్కూల్‌ను డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ సందర్శించారు. పాఠశాలలోని ఎండీఎం, ఐఎఫ్‌టీ ల్యాబ్, కంప్యూటర్ ల్యాబ్, వృత్తి ప్రయోగశాలను పరిశీలించారు. 10వ తరగతి విద్యార్థులతో బోధన తీరును పరిశీలించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మోడల్ పాఠశాలలు తెలంగాణకే తలమానికంగా అన్నారు. రాష్ట్రంలో మోడల్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత నమోదైందని మోడల్ పాఠశాలలను అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అనంతరం పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరుశాతంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని మెరుగుపర్చాలని సూచించారు. ఆయన వెంట ప్రిన్సిపాల్ ఫేరోజ్ హైదర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కేజీబీవీ విద్యార్థులకు పౌష్టికాహారం అందజేయాలి



కేజీబీవీ లో మాట్లాడుతున్న ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్

డిచ్‌పల్లి, జూలై 8(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో ఆరోగ్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పౌష్టికాహారంపై సూచనలు ఆరోగ్య విస్తీర్ణాధికారి తెలిపారు.వర్షకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు సోకే ప్రమాదాలు ఉంటాయని పరిసరాలుపరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థులందరు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏలాంటి వ్యాధులు రావని తెలిపారు. ఐయోడిన్ ఉప్పును వాడలని వంట సిబ్బందికి సూచించారు. ఉడకబెట్టిన పల్లీలు, బటానిలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిత, ఆరోగ్య పరిశీలకులు అక్బర్, దేవపాల, ఆరోగ్య కార్యకర్తలు వినిత్, మేరీ, శోభా, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు జవాబుదారీగా ఉండాలి





మాట్లాడుతున్న జడ్పీ సీఈవో సాయగౌడ్

సుభాష్‌నగర్,జూలై 8(ఆంధ్రజ్యోతి):నూతనంగా కారుణ్య నియామకంలో ఎంపికైన ఉద్యోగులు అందరు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని జడ్పీ సీఈవో సాయగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని జడ్పీ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో మంగళవారం జూనియర్ అసిస్టెంట్లకు సర్వీస్ నిబంధనలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది రోజులపాటు ఈ శిక్షణ కార్య క్రమం ఉంటుందని తెలిపారు. ఒక్కో రోజు ఒక్కో అంశంపై నూతన ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సర్వీస్ నిబంధనలపై సుదీర్ఘంగా వివరించారు. ఉద్యోగంలో నిక్కచ్చిగా వ్యవహరించాలని సూచించారు. మొదటగా జిల్లా పరిషత్ ఎన్నికలు,పబ్లిక్ కార్యాలయ నిబంధనలు, ఆర్‌టీఐ పై శిక్షణ తదితర అంశాలపై ప్రతిరోజు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఈవో సాయన్న, సూపరింటెండెంట్ లింగన్న, శ్రీనివాస్ రావు, సునీతదేవి, నందిపేట్ ఎంపీడీవో శ్రీనివాస్‌రావు, నిజామాబాద్ జిల్లా పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్, సిద్ధుపటేల్, ఆర్గనైజర్ శ్రీనివాసన్, పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో చికిత్స పొందుతూ చిన్నారి మృతి



మనస్వీ (ఫైల్)

నిజామాబాద్‌అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): మాక్లూర్ ఎస్సై కథనం మాక్లూర్ మండలం దుర్గానగర్ సింగంపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఎలియా నాయక్ తండాలో బాణావత్ మనస్వీ (4) బంధువుల ఇంటిలో ఏప్రిల్ 9న ఆడుకుంటూ.ఎలక్ట్రిక్ హీటర్‌ను ముట్టుకొని కరెంట్ షాక్‌కు గురైంది. గమనించి కుటుంబ సభ్యులు నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవే ట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందింది. బాలిక తండ్రి బాణవత్ విజయ్‌కుమార్, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## చంద్రాయాన్‌పల్లిలో రోడ్డు ప్రమాదం

● ఒక లారీ, మూడు కార్లు ఢీ ● తప్పిన ప్రాణాపాయం

ఇందల్వాయి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఇందల్వాయి 44 జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు ప్రమాదంలో ఓ లారీ, మూడు కార్లు ఢీకొనగా ఎలాంటి ప్రాణాపాయం జరగలేదు. మండలంలోని చంద్రయాన్‌పల్లి వద్ద మంగళవారం నిజామాబాద్ వైపు నుండి హైదరాబాద్ వెళ్తున్న లారీ ముందు వెళ్తున్న కారును ఢీకొనగా ఆ కారు ఎదురుగా ఉన్న మరో కారును ఢీకొట్టింది. అనంతరం కార్లను ఢీకొని లారీ ఆగిపోవడంతో వెనుక నుంచి వస్తున్న మరో లారీ ముందున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తిని స్వల్ప గాయాలు కాగా ఈ ప్రమాదంలో రెండు కార్లు భారీగా ధ్వంసం అయ్యాయి. మరో కారు పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. ఆ కారులో ప్రయాణిస్తున్న కామారెడ్డికి వెళ్తున్న ముగ్గురికి స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. హైదరాబాద్ వెళ్లే కారు పూర్తిగా ధ్వంసం కాగా అందులో ప్రయాణించేవారు సురక్షితంగా బయటపడ్డారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్ జామ్‌ను క్లియర్ చేశారు. ఈ ఘటనలో ఎవరికి ప్రాణాపాయం జరగలేదని ఎస్సై తెలిపారు.

## కూరగాయల వర్తకుల సమస్యలు పరిష్కరించాలి

మోపాల్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): గాంధీగంజ్ రిటేల్ కూరగాయల వర్తకుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఓమయ్య ఆధ్వర్యంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఓమయ్య మాట్లాడుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధీనంలో ఉన్న గాంధీ గంజ్ లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరారు.గాంధీగంజ్‌లో రిటేల్ కూరగాయల వర్తకులకు కూరగాయల అమ్మకానికి అనుగుణంగా నూతన షెడ్లను నిర్మించి ఇవ్వాలని విద్యుత్ సౌకర్యం కల్పించాలని మార్కెట్ కార్డు రికార్డులో పేర్లు నమోదు చేసి అద్దె వసూ లు చేయాలని కోరారు.ఈకార్యక్రమంలో వర్తకుల సంఘం అధ్యక్షుడు లింగం, ప్రధాన కార్యదర్శి కండ్లకోయ ప్రసాద్, నాయకులు సత్యనారాయణ,సలీమ్, గోవర్ధన్,సాయిలు,పరుశురాం ఉన్నారు.

## పద్మశాలి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): పద్మశాలిల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర పద్మశాలి సంఘం ద్వారా ప్రభుత్వానికి వివరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పద్మశాలి సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు బిల్ల మహేష్ అన్నారు. ఈ సందర్భంగా ఆయనను పట్టణ, నగర పద్మశాలి సంఘం, యువజన సంఘం ప్రతినిధులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దుబ్బరాజం, శ్రీనివాస్, సుభాష్, రవి, గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా అంతటా ఇందిరా మహిళా శక్తి సంబురాలు





ఏర్గట్లలో సంబురాల్లో పాల్గొన్న మండల సమాఖ్య సభ్యులు

ఏర్గట్ల,జూలై 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం మహిళాశక్తి సంబురాల్లో భాగంగా మండల సమాఖ్య ప్రత్యేక సమావేశం నిర్వహించినట్లు ఏపీఎంశ్యామ్ తెలిపారు. అందులో భాగంగా పలుఅంశాలను అమలు చేసినట్లు తెలిపారు. మిగిలి పోయిన మహిళలను సంఘాల్లో చేర్పించడం, అర్హత గల దివ్యాంగులను, కిషోర బాలికలను సంఘాలుగా పునరుద్ధరణ, బ్యాం కు రుణాలు, వ్యవసాయ ఆధారిత, వ్యవసాయేతర ఉపాధి జీవనోపాదులు, అమ్మ ఆదర్శ పాఠ శాలలు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీసీ సంతోష్, నవీన్, సుప్రియ, వీవోలు పాల్గొన్నారు.

**డిచ్‌పల్లి:**ఇందిర మహిళ శక్తి సంబరాలను విజయవంతం చేయాల్సిన బాధ్యత మహిళ సంఘాలపై ఎంతైన ఉందని మహిళలు సాధించిన విజయాలు గ్రామ స్థాయిలో ప్రచారం అయ్యేలసమావేశాలు నిర్వహించాలని డీపీఎం సంధ్యరాణి పేర్కొన్నారు. మహిళ శక్తిలో భాగంగా మంగళవారం డిచ్‌పల్లి ఐకేపీ కార్యాలయంలో స్త్రీనిధి, వడ్డీలేని రుణాలు, ప్రమాద బీమా, బ్యాంక్ లింకేజీ, ఆర్థిక అక్షరాస్యత వంటి అంశాలపై నిర్వహించిన సమావేశానికి డీపీఎం హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం,సీసీలు, వీవోలు, గ్రామ అధ్యక్షులు, ఈసీలు పాల్గొన్నారు. ధర్మారం వీవో మాధవి, సాంపల్లి వీవో నిహారికను ఈ సందర్భంగా సన్మానించారు.

**కోటగిరి:** కోటగిరి మండల కేంద్రంలో ఉన్న ఐకేపీ కార్యాలయంలో మంగళవారం ఇందిరా మహిళ శక్తి సంబరాలు ఘనంగా నిర్వహించారు. గత ఏడాది మహిళ సంఘం సాధించిన ప్రగతి, ఈ సంవత్సరం సాధించాల్సిన ప్రగతిపై చర్చించారు. బుధవారం నుండి గ్రామ సంఘాల్లో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీఎం బస్వంత్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐకేపీ సిబ్బంది విఠల్, సాయిబాబా, మండల సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**నవీపేట:** మండల ఐకేపీ కార్యాలయంలో మంగళవారం గ్రామ సంఘాల అధ్యక్షులు, వీవోఏల సమావేశం నిర్వహించారు. త్వరలో జరిగే ఇందిరా మహిళ శక్తి సంబరాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం భూమేష్ గౌడ్, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, లక్ష్మి, సుశీల, శ్రీనివాస్, రుక్మాజీ, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

**మోర్తాడ్:** మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మం డల సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా శక్తి సంబురాలు నిర్వహించారు. బ్యాంక్ రుణాలు తీసుకొని ఆదాయం సమకూర్చుకున్న వారిని, ఈఎంఎఫ్ లోన్ తీసుకొని ఆదాయం సమకూర్చుకున్న వారిని, స్కూల్ యూనిఫామ్‌లు కుట్టిన వారిని ఘనంగా సన్మానిం చారు. ఏపీఎం మహిళ ప్రమీలా, సీసీలు తడకాల శ్రీనివాస్, మహేందర్, రాజేశ్వర్, శ్రీనివాస్, మహిళలు పాల్గొన్నారు.

**ముప్కాల్:**ముప్కాల్ మండలంలోని ఆయా గ్రామాలలో ఈనెల 18వరకు ఇందిరమ మహిళ సంబురాలు నిర్వహించనున్నాట్లు ఏపీవో ప్రసాద్‌రావు తెలిపారు.ఈసందర్భంగా ముప్కాల్ మండల కేంద్రంలో మహిళ సమాఖ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసంబురాల్లో భాగంగ ప్రత్యేక సమావేశం నిర్వహించి మహిళలను మహిళాసంఘాల్లో చేర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోగౌస్‌మోయినోద్దీన్,సీసీలు, వీఏలు పాల్గొన్నారు.

**కమ్మర్‌పల్లి:** ప్రతి మహిళను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగస్వాములు చేయాలని కమ్మర్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌పాలెపు నర్సయ్య అన్నారు. మంగళవారం కమ్మర్‌పల్లి మండల ఐకేపి శిక్షణ కార్యాలయంలో నిర్వహించిన మండలస్థాయి ఇందిరా మహిళ మహిళ శక్తి సబరాల ప్రత్యేక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జీప్రసాద్, ఎంపీడీవో రాజా శ్రీనివాస్ మండల మహిళసమాఖ్య అధ్యక్షురాలు కమల, కార్యదర్శి రోజా రాణి, ఉపాధ్యక్షురాలు, సహాయ కార్యదర్శి, ఐకేపి సీసీలు వర్షం శ్రీనివాస్, నవీన్ కుమార్, భాగ్యలక్ష్మి, లేఖ్య, దనలక్ష్మి, సిబ్బంది అనసూయ, దనలక్ష్మి, నత్తెమ్మ గ్రామసమాఖ్య ప్రతినిదులు, వివోఏలు పాల్గొన్నారు.

## నేడు సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

డిచ్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై నేడు డిచ్‌పల్లి మండల కేంద్రంలో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో సమ్మె నిర్వహిస్తున్నట్లు ఈ సమ్మె రైల్వే స్టేషన్ వద్ద జరగనుందని నాయకులు జేపీ గంగాధర్, శాంసన్ తెలిపారు.కార్మికులు 8గంటల పనిదినాలు అమలుచేయాలని అసంఘటిత కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాని వారు డిమాండ్ చేశారు. నేడు సమ్మె విజయవంతం చేయాలని కోరారు

**మోపాల్:**కేంద్ర ప్రభుత్వం కార్మిక రైతు వ్యతిరేక విధానాలు చేపడుతుందని కార్మికవర్గం ఈనెల 9వతేదీన దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిందని ఈ సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కిసాన్ మోర్చ ఎస్‌కెఎం సంపూర్ణ మద్దతు తెలి యజేస్తుందని వేల్పూర్ భూమయ్య అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ జిల్లా కార్యదర్శి సాయాగౌడ్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి అగ్గు చిన్నయ్య, గంగమల్లు, తదితరులు పాల్గొన్నారు.

**నిజామాబాద్ కల్చరల్:** సీపీఐ ఆధ్వర్యంలో ఈనెల 19న నిర్వహిస్తున్న మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి సుధాకర్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమానికి జాతీయ కార్యదర్శి అజీజ్ పాషా, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పద్మ ముఖ్య అతి థులుగా హాజరవుతారని అన్నారు. ఈకార్యక్రమంలో నగర కార్యదర్శి ఓమయ్య, జిల్లా నాయకులు సురేష్, అలీఇమ్రాన్ పాల్గొన్నారు.

**ముప్కాల్:** పనికి సమాన వేతనం అమలుకు దేశ వ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నారాడి లక్ష్మణ్, పోశెట్టి, రాములు, మల్లేష్, అడెల్లి, తదితరులు పాల్గొన్నారు.

**సిరికొండ:** కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న కార్మిక,ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బుధవారం జరిగే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెకు డెమోక్రటిక్ ఉపాధ్యాయ సమాఖ్య సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తెలిపారు.

**మాక్లూర్:** బుధవారం రోజు జరుగబోయే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భారత కార్మిక సంఘాల సమైక్య ఐఎఫ్‌టీయు జిల్లా సహాయకార్యదర్శి గంగాధర్ పిలుపునిచ్చారు. మాక్లూర్ మండలం మానిక్ బండార్‌లో ఆయన మాట్లాడుతూ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు జరుగుతున్న సమ్మెను జయప్రదం చేయాలన్నారు.ఈకార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**నిజామాబాద్‌కల్చరల్:** పార్టీలు, కండువాలు వేరైనా కాంగ్రెస్, బీజేపీల విధానం ఒక్కటేనని కార్మికవర్గంపై ప్రభుత్వ చర్యలు అందుకు నిదర్శనం అని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ అన్నారు. ఈకార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాస్, రమేష్, కుమారస్వామి, శ్రీను,జగదీశ్, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## గుర్తుతెలియని మహిళ మృతి

నిజామాబాద్‌అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):నగరంలోని రైల్వే స్టేషన్ రేకుల షెడ్డు వద్ద గుర్తుతెలియని మహిళ అపస్మారక స్థితిలో ఉండగా పోలీస్ సిబ్బంది 108కు సమాచారం ఇవ్వడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు 1వ టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి తెలిపారు. గుర్తుతెలియని మహిళ వయస్సు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉందని బిక్షాటన చేసుకొని జీవిస్తున్న ముస్లీం వ్యక్తిగా కనిపిస్తుందని ఎవరికైనా సమాచారం తెలిస్తే 1వ టౌన్ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

## బెస్ట్ అవైలబుల్ స్కీం పెండింగ్ బిల్లులు చెల్లించాలి

సుభాష్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): బెస్ట్ అవైలబుల్ స్కీంలో పెండింగ్ బిల్లులు చెల్లించి విద్యార్థులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్సీ కొమురయ్యకు జిల్లా కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సోషల్ మీడియా వేదికగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న బెస్ట్ అవలైబుల్ పథకం ద్వారా పేద, ఎస్సీ, ఎస్టీ బీసీ వర్గాల విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచితంగా విద్య అభ్యసిస్తున్నారు. ఈ పథకం కింద డే స్కాలర్స్‌కు 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ.42వేల చొప్పున ప్రభుత్వమే ఫీజులు చెల్లిస్తుందన్నారు. గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకానికి బిల్లులు రెండువందల కోట్ల మేర చెల్లించకపోవడంతో పాఠశాల యాజమాన్యాలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు. స్కూల్‌లలో చదువుకుంటున్నటువంటి వారిని స్కూలు రావద్దని కొన్ని పాఠశాలల యజమాన్యాలు చెప్పడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఈ పథకం కింద రెసిడెన్షియల్ స్కూళ్లలో చదువుతున్న పాత విద్యార్థులు తాము చెప్పేంత వరకు స్కూల్‌కు పంపొద్దని యాజమాన్యాలు చెబుతు న్నాయని, డే స్కాలర్ విద్యార్థులు వెయ్యి రూపాయల ఫీజు చెల్లించిన తర్వాతనే క్లాస్‌కు రావాలని చెబుతున్నాయన్నారు. దీంతో విద్యార్థులు చదువుల్లో వెనకబడి పోతున్నారని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో చర్చించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు 200కోట్ల మేర పెండింగ్‌లో ఉన్న బిల్లులను తక్షణమే విడుదల చేసి విద్యార్థులను, పాఠశాల భవిష్యత్‌ను కాపాడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.

## ఇన్‌చార్జి బీసీ అభివృద్ధి అధికారిగా నర్సయ్య

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):జిల్లా బీసీ అభివృద్ధి ఇంచార్జి అధికారిగా నర్సయ్య నియమితులయ్యారు. ఇదివరకు బీసీ అభివృద్ధి అధికారిగా పనిచేసిన స్రవంతిని ఆదిలాబాద్ ఆర్‌డీవోగా బదిలీ చేశారు. ఇంకా పూర్తిస్థాయి అధికారిని నియమించలేదు. రెవెన్యూ శాఖ నుంచి వచ్చిన స్రవంతిని జిల్లా బీసీ అభివృద్ధి అధికారిగా కొనసాగించగా ఆమె సొంత శాఖకు వెళ్లిపోయినట్లు తెలుస్తుంది. పూర్తిస్థాయి అధికారిని నియమించేంతవరకు నర్సయ్య ఇంచార్జి అధికారిగా పనిచేయనున్నారు.

## ఆర్యవైశ్య ఎన్నికలు గందరగోళం

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):నగరంలోని ఆర్యవైశ్య సంఘంతో పాటు అనుబంధ సంఘాలకు ఆదివారం నిర్వహించిన ఎన్నికలు గందరగోళానికి దారి తీశాయి. నగరంలోని మానిక్‌భవన్ పాఠశాలలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా క్రాస్ ఓటింగ్ జరిగిందంటూ కొంత మంది ఎన్నికల ఇన్‌చార్జికి ఫిర్యాదు చేయగా ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను నిలిపివేశారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తుడుపునూరి విజయ్‌కుమార్ అనే వ్యక్తి ఎన్నికల మధ్యలో నుంచే వెళ్లిపోవడం వివాదానికి కారణమవుతుంది. ఓటింగ్ జరుగుతున్న సమయంలోనే ఎన్నికల అధికారి మధ్యలో నుంచి వెళ్లిపోవడంతో ఎన్నికల్లోఅక్రమాలు జరిగినట్లు ప్రత్యర్థివర్గాలు ఆరోపిస్తున్నాయి. రాజకీయ ప్రమేయంతోనే ఫలితాలను తొక్కిపెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

## భూసంబంధిత చట్టాలు, సూత్రాలపై అవగాహన

డిచ్‌పల్లి,జూలై 8(ఆంధ్రజ్యోతి):టీయూ న్యాయ కళాశాలలో మంగళవారం భూసంబంధిత చట్టాలు, పన్నుల సూత్రాలు, అనే అంశంపై జరిగిన అవగహన సదస్సుకు రిసోర్స్ పర్సన్ నరసింహచార్యులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆదాయపు పన్నుల్లో పనిచేసి మార్చి 25న రిటైర్డు అయ్యాయని సంబంధిత చట్టాల గురించి మరో రిసోర్స్ పర్సన్ సుబ్రమణ్యం భూసంబంధిత చట్టాలపై సామాన్యులకు అర్థమయ్యేల వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రసన్న రాణి కన్వీనర్ గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## నిజామాబాద్ వర్సెస్ కృష్ణమూర్తి జట్ల మధ్య టెస్ట్ మ్యాచ్ డ్రా

సుభాష్‌నగర్, జూలై 8 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ వర్సెస్ కృష్ణమూర్తి జట్ల మధ్య జరిగిన టెస్ట్ మ్యాచ్ డ్రా అయ్యింది. హైదరాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో జరిగిన పోటీలో వర్షం కారణంగా మ్యాచ్ రద్దు అయ్యింది. కృష్ణమూర్తి జట్టు టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొని 90 ఓవర్లకు గాను 359 పరుగులు చేసింది. కృష్ణమూర్తి జట్టులో అర్హాన్ 100 పరుగులు చేయగా హుస్సేన్ 91 పరుగులు చేశారు. నిజామాబాద్ బౌలర్‌లలో విక్రమ్ 2 వికెట్లు, జస్ప్రీత్‌రెడ్డి, నవీన్‌కుమార్, శ్రీకర్‌రెడ్డిలు ఒక్కోక్క వికెట్లు తీసుకున్నారు. రెండో ఇన్నింగ్‌లో బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 238 పరుగులు చేసి 3 వికెట్లు కోల్పోయింది. ఇందులో విక్రాంత్ 76 పరుగులు నాటౌట్‌గా నిలిచాడు. జస్ప్రీత్, వర్షిత్‌రెడ్డిలు చెరో 48 పరుగులు చేశారు. వర్షం కురవడంతో మ్యాచ్ రద్దు అయి డ్రాగా ప్రకటించారు. ఇరుజట్లకు చేరో రెండు పాయింట్లు కేటాయించారు.

## ఉమ్మడి జిల్లా దేవాలయాలకు నూతన కార్యవర్గం నియామకం

నిజామాబాద్ కల్చరల్ , జూలై 8 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలోని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆలయాలకు నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ దేవాదాయ ధర్మాదాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. మంగళవారం నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ ఆయా జిల్లా దేవాదాయ శాఖకు ఉత్తర్వులు విడుదల చేసింది. ఉమ్మడి జిల్లాలోని 37దేవదాయ ఆలయాలకు గాను నగరంలో మూడు దేవాలయాలకు నూతన కార్యవర్గాన్ని నియమించింది. శంభులింగేశ్వర ఆలయం, జెండా బాలాజి మందిరం, హమాల్‌వాడి సాయి సంతోషి ఆలయం, డిచ్‌పల్లిలోని ఖిల్లా రఘునాథ రామాలయం, కామారెడ్డి జిల్లాలోని సుక్కాపూర్ లక్ష్మీనర్సింహ స్వామి ఆలయం, సలాబత్‌పూర్ అంజనేయ స్వామి దేవాలయాలకు నూతన కార్యవర్గం నియమించారు.

## సిరికొండ పాఠశాల తనిఖీ



హైస్కూల్లో విద్యార్థులకు చేస్తున్న డిజిటల్ బోధన వింటున్న జేసీ

సిరికొండ జులై 8 (ఆంధ్రజ్యోతి):సిరికొండలో అదనపు జేసీ అంకిత్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఉదయమే సిరికొండలో గల ప్రాథమిక, జిల్లా పరిషత్ హైస్కూల్‌ను సందర్శించి ప్రతి తరగతిలోకి వెళ్లి విద్యార్థులను పలువివరాలను అడిగి తెలుసుకున్నారు. మొదట ప్రాథమిక పాఠశాలకు వెళ్లిన అదనపు జేసీ వంట తదిలోకి వెళ్లి వంట చేస్తున్న భోజనాలను పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెడుతున్నారా అని ప్రశ్నించి వివరాలను రాబట్టారు.తరగతి గదుల్లోకి వెళ్లి పాఠ్యపుస్తకాలు అన్ని వచ్చాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సంఖ్య పెరిగిందా? అని ప్రధానోపాధ్యాయురాలిని, ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఒకే గదిలో రెండో తరగతుల విద్యార్థులను కుర్చోబెట్టారా అని ప్రశ్నించారు. సిరికొండలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటిని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సిరికొండకు ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి,ఎన్ని పనులు ప్రారంభమయ్యాయని పంచాయతీ కార్యదర్శి వినీల్ అడిగారు.నిర్మాణం ప్రారంభం కాకుంటే లబ్ధిదారులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. సిరికొండకు 32ఇల్లు మంజూరు కాగా 16మంది లబ్ధిదారులు పనులు ప్రారంభించారని వివిధదశల్లో నిర్మాణం జరుగుతున్నాయనిపంచాయ తీ కార్యదర్శి వినీల్ వివరించారు.ఆయన వెంట ఎంపీడీవో మనో హర్‌రెడ్డి, తహసీల్దార్ రవీందర్‌రావు, ఎంపీవో తారచంద్, ప్రధానోపాధ్యాయులు సతీష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## టీయూలో ఘనంగా ఏబీవీపీ 77వ జాతీయ విద్యార్థి దినోత్సవ వేడుకలు

డిచ్‌పల్లి, జూలై 8 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి పరిషత్ తెలంగాణ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో 77వ జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా మంగళవారం ఏబీవీపీ విద్యార్థి నాయకులు, విద్యార్థులు, సైన్స్ కళాశాల నుంచి మెయిన్ గేటు వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇందూరు విభాగ్ సంఘటన మంత్రి కుంట హర్షవర్ధన్‌రెడ్డి హాజరయ్యారు.జూలై 9, 1949 ఢిల్లీ యూనివర్సిటీ లో 4గురు విద్యార్థులు ఒక ప్రొఫెసర్‌తో ప్రారంభమైన విద్యార్థి సంఘం నేడు 58లక్షల సభ్యత్వాలతో అతిపెద్ద విద్యార్థి సంఘం గా ఏర్పాడిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఇందూరు విభాగ్ కన్వీనర్ శశి, కమిటీ మెంబర్ అమృత్‌చారి, వర్సిటీ అధ్యక్షుడు సాయి కుమార్, ఉపాధ్యక్షుడు నవీన్, అనిల్, నమీర్, పృథ్వి అజయ్, మనోజ్, హరినాథ్‌రెడ్డి, లెనిన్, అనిల్, అఖిల్, సునీల్, పాల్గొన్నారు.

## ధర్పల్లిలో ఘనంగా శీతల్ పండుగ

ధర్పల్లిజూలై 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ తాండాల్లో మంగళవారం శీతల్ పండుగను గిరిజనులు అత్యంత వైభవంగా జరుపు కున్నారు. ఈ సందర్భంగా గిరిజనుల ఆరాధ్యదైవమైన శీతలాదేవికి భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. పశుసంపద, పంట పొలాలు సమృద్ధిగా పండాలని ప్రతియేటా శీతల్ పండుగను నిర్వహిస్తారు. అనంతరం విందు భోజనాలు ఆచరిస్తారు. భక్తిశ్రద్ధలతో శీతల పండుగను తాండాలో అత్యంత వైభవంగా జరుపుకున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల డ్రైవర్ కాలనీ నాగారం వద్ద గంజాయి ప్యాకెట్లు విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. నాగారం 80 క్వాటర్స్‌లో నివాసం ఉండే సోలంకే రత్నదీప్ (19) డ్రైవర్ పనిచేస్తూ గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అతడిని పట్టుకొని విచారించగా అతని వద్ద 5 ప్యాకెట్ల గంజాయి సుమారు 15 గ్రాములు లభించగా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు 5వ టౌన్ ఎస్సై గంగాధర్ తెలిపారు. రత్నదీప్ గత కొద్దిరోజులుగా గంజాయికి అలవాటు పడి అధిక డబ్బులు సంపాదించాలనే ఉద్దేశ్యంతో తెలిసిన వ్యక్తి దగ్గర గంజాయి కొనుగోలు చేసి నిజామాబాద్ పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నాడని మంగళవారం డ్రైవర్ కాలనీ వద్దకు అమ్మడానికి రాగా అతన్ని పట్టుకున్నట్లు తెలిపారు. గంజాయి ఎవరైనా అమ్మిన, కొన్న, తాగిన వారిపై కేసు నమోదు చేస్తామన్నారు.

## విద్యాశాఖ కార్యాలయంలో కొనసాగిన సర్టిఫికెట్ల పరిశీలన

నిజామాబాద్ అర్బన్, జూలై 8 (ఆంధ్రజ్యోతి):స్కూల్ అసిస్టెంట్ల నుంచి పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి పొందేందుకు అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను మంగళవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పరిశీలించారు. మల్టీజోన్-1 పరిధిలో 2002 డిసెంబర్ నాటికి సీనియారిటీ ఆధారంగా స్కూల్ అసిస్టెంట్లకు పీజీ హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించేందుకు విద్యాశాఖ అధికారులు సీనియారిటీ జాబితాను రూపొందిస్తున్నారు. సీనియారిటీ జాబితా ఆధారంగా అర్హులైన ఉపాధ్యాయుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్నారు. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆదేశాల మేరకు సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. 51 ఖాళీలు ఉండగా ఆర్‌జేడీ ఆధ్వర్యంలో మల్టీజోన్ పరిధిలో రూపొందించే సీనియారిటీ జాబితా ప్రకారం పదోన్నతులు ఇచ్చే అవకాశం ఉంది. జిల్లాలో 260కి పైగా స్కూల్ అసిస్టెంట్లు అర్హత కలిగి ఉన్నారు. వారిలో ఎంత మందికి పదోన్నతి వస్తుందనేది తేలాల్సి ఉంది. అర్హత, డిపార్ట్‌మెంటల్ టెస్ట్ పాసై ఉన్న వారికి పదోన్నతులు రానున్నాయి. గత సెప్టెంబర్ నుంచి జిల్లాలో 51 మంది పీజీ హెచ్‌ఎంలు రిటైర్ కాగా వారి స్థానాల్లో పదోన్నతి పొందిన వారిని భర్తీ చేయనున్నారు. ఏమైనా చార్జీలు పెండింగ్‌లో ఉన్న వారికి పదోన్నతులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది.